క్లుప్తంగా

ఘనంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లిలో ఉన్న వరలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజాము నుంచి అర్చకులు గణపతి పూజ, స్వస్తి వాచనం, కంకణధారణ, మహామంగళ హారతి తదితర పూజలు చేశారు. అభిషేకాలు, రుద్ర స్వాహాకార హోమం, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వర బాబు, సీనియర్ నాయకుడు కప్పలబండ మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్ వరదరాజులు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గంగరాజు, ఆంజనేయులు, సుంకయ్య, కంబయ్య, పుల్లెప్ప, హరికృష్ణ, గోవిందుగౌడ్, అక్బర్, వలి, మధు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం



ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే

గుత్తి రూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయ ముఖద్వారాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా ప్రారంభించారు. గ్రామంలోని గురు రాఘవేంద్రస్వామి ఆనందాశ్రమంలో మాజీ ఎమ్మెల్యే సహకారంతో లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ ఆధ్వర్యంలో ఆలయంలో ముఖద్వారం నిర్మించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసుదేవరెడ్డి, గ్రామస్తులు జయరంగారెడ్డి, వలి, గుత్తి ఆర్ఎస్ మాజీ ఉప సర్పంచ్ మధుసూదన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మరమ్మతుల వివరాలందజేయండి

సాక్షి ఎఫెక్ట్..

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మరమ్మతులకు గురైన గ్యాస్ స్టౌలు, కుక్కర్ల వివరాలను తన కార్యాలయానికి అందజేయాలని అంగన్‌వాడీ టీచర్లను సీడీపీఓ సాజిదాబేగం ఆదేశించారు. సాక్షిలో గురువారం 'ప్రమాదపుటంచున పసిప్రాణాలు' అన్న కథనంపై సీడీపీఓ స్పందించారు. సీడీపీఓ ఆదేశాల మేరకు తాడిపత్రి పట్టణంతోపాటు ఆయా మండలాల అంగన్‌వాడీ టీచర్లు క్లస్టర్ గ్రూపులో మరమ్మతుల వివరాలను పెట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన రంగయ్య

గుత్తి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం రోడ్డు ప్రమాదంలో జరిగి విద్యుత్ కార్మికుడు రంగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. చెట్నేపల్లికి చెందిన విద్యుత్ కార్మికుడు రంగయ్య గుత్తి నుంచి ఆర్ఎస్‌కు బైక్‌లో బయలుదేరాడు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుత్తి: పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో గురువారం అన్న క్యాంటీన్‌ను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రారంభించారు. అనంతరం ప్రజలకు టిఫిన్ వడ్డించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో ప్రజలకు కేవలం ఐదు రూపాయలకే భోజనం పెడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, టీడీపీ నాయకులు నారాయణ, శ్రీనివాసులు, నారాయణస్వామి, పట్టణ, మండల అధ్యక్షులు చౌదరి, బర్దివలి, మహిళా నాయకురాళ్లు సునీత, శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాయం ఏదీ!



- కొందరికే 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి'
- ఊసేలేని 'అన్నదాత సుఖీభవ'..

పుట్లూరు: ప్రభుత్వ సాయం అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల విడుదల చేసిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు జమకాక పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఆర్థికంగా అండగా ఉండాలనే సంకల్పంతో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రారంభించింది. ఈ పథకం కింద ఈ ఏడాది అక్టోబర్ 5వ తేదీన పీఎం నరేంద్రమోడీ 18వ విడత సహాయాన్ని విడుదల చేశారు. ఏడాదికి రూ.6 వేల చొప్పున మూడు వాయిదాల్లో రూ.2వేల ప్రకారం రైతుల ఖాతాలలోకి ఈ పథకం కింద ఆర్థిక సహాయాన్ని జమ చేస్తున్నారు. అయితే అర్హత ఉన్న చాలా మంది రైతులకు 18వ విడత నగదు జమ కాకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రధానంగా ఈ-కేవైసీ చేసుకోని రైతులకు లబ్ధి చేకూరడం లేదని వ్యవసాయాధికారులు తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద అర్హుల జాబితాలో ఉండి, సాయం అందని రైతులు సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్)లో బయోమెట్రిక్ ఆధారిత ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఆర్థిక సాయం కోసం కొత్తగా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు అర్హుల జాబితాలో చోటు దక్కలేదు. కేవలం 2019 ఫిబ్రవరి 20వ తేదీకి ముందు ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలకు మాత్రమే ఈ పథకం కింద లబ్దిదారులుగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అన్నదాత సుఖీభవ ఎప్పుడో?

సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలనూ ఊరించారు. సూపర్ సిక్స్‌లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయంగా రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పథకంపైనా స్పష్టత ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పులు చేసి ఖరీఫ్ పంటలు సాగు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం నేటికీ పెట్టుబడి సాయం ఊసెత్తడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాయం అందలేదు



పీఎం కిసాన్ పథకం కింద ప్రతి ఏటా రైతులకు రూ.6 వేలు అందిస్తుండటంతో 2021లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. కానీ ఇప్పటి వరకూ ఈ పథకం ద్వారా లబ్ధి అందలేదు. అర్హత ఉన్న రైతులందరికీ ఈ పథకం కింద లబ్ధి చేకూర్చాలి. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

– పృథ్వీ, రైతు, జి.వెంగన్నపల్లి

ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పరిష్కరిస్తున్నాం. ఈ-కేవైసీ పెండింగ్ ఉండి కొందరికి లబ్ధి చేకూరలేదు. బయోమెట్రిక్ ఆధారిత ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నాం. నిబంధనల మేరకు అర్హులైన రైతులందరికీ ఈ పథకం కింద సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కాత్యాయని, వ్యవసాయ అధికారి

నేడు మండల సమావేశం

పామిడి: పట్టణంలోని ఎంపీడీఓ సభాభవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కే తేజోత్స్న గురువారం తెలిపారు. సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్యం, విద్యుత్, హౌసింగ్, రెవెన్యూ తదితర అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు, అనధికారులు, ప్రజాప్రతినిధులు, సభ్యులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

నేటి నుంచి గ్రామ సభలు

గార్లదిన్నె: మండలంలో భూములు రీసర్వే చేసిన గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. గురువారం తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే చేసిన గ్రామాల్లో భూములకు సంబంధించి సమస్యలు ఉంటే గ్రామ సభల్లో రైతులు అర్జీలు సమర్పించుకుంటే పరిష్కారిస్తామన్నారు. శుక్రవారం అంకంపేట, క్రిష్టాపురం, 19న కల్లూరు అగ్రహారం, కొప్పలకొండ, 21న ఓబుళాపురం, జంబులదిన్నె, 22న మర్తాడు, బూదేడు, 23న కనంపల్లి, శిరివరం, 24న కోటంకలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

పెద్దవడుగూరు: రీ సర్వే గ్రామాల్లో ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఉషారాణి గురువారం తెలిపారు. 18న తెలికి , చింతలచెరువు, 19న కొండూరు, నాగలాపురం, 21న కోనాపురం, మేడిమాకులపల్లి, 22న ముప్పాలగుత్తి , విరుపాపురం, 23న జి.వెంకటాంపల్లి, మల్లేనిపల్లి, 24న ఆవులాంపల్లిలో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్ఆర్ఐటీకీ మల్టిపుల్ బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డు



అవార్డును చూపుతున్న కళాశాల సిబ్బంది

శింగనమల: ఢిల్లీలో ఇటీవల జరిగిన ఎడ్యుస్కిల్స్ కనెక్ట్ -24 కార్యక్రమంలో రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటీ కళాశాల ఆలిండియా 4వ ర్యాంక్ సాధించి మల్టిపుల్ బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డును సాధించినందుకు కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ టీపీఓ అవార్డును డాక్టర్ ఎం.రంజిత్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులైన సిలోనీస్ పి.వీరకాష్, పాలో ఆల్టోకు డాక్టర్ పి.చిత్రలింగప్ప, జెడ్ స్కేల్‌కు డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్, బ్లూప్రిజంకు ఎల్.సుమన్, యు.ఐ.పాత్‌కు సి.సుధీర్‌కుమార్ ఉత్తమ మార్గనిర్దేశకులుగా అవార్డులను గెలుచుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బాలకృష్ణ మాట్లాడుతూ ఈ అవార్డు కళాశాల అందించే నాణ్యమైన విద్యకు నిదర్శనమన్నారు.

నేటి నుంచి సబ్సిడీ పప్పుశనగ పంపిణీ

గుంతకల్లు రూరల్: మండలంలో శుక్రవారం నుంచి సబ్సిడీ విత్తన పప్పుశనగ పంపిణీ చేస్తామని ఏఓ స్వాతి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం 10 గంటలకు సబ్సిడీ విత్తన పప్పుశనగ పంపిణీ ప్రారంభిస్తామన్నారు. 25 శాతం సబ్సిడీతో అందజేస్తున్న పప్పుశనగ క్వింటాల్ ధర రూ.7,050గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్థ ఎకరా నుంచి గరిష్టంగా 5 ఎకరాలున్న రైతులకు ఒక బ్యాగు (25 కిలోలు) నుంచి 10 బ్యాగుల వరకూ పంపిణీ చేస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి

యాడికి: బాణసంచా దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో యాడికి సీఐ ఈరన్న, ఫైరింజన్ ఎస్ఐ మోహన్‌బాబుతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో దీపావళి పండుగ సందర్భంగా టపాసులు విక్రయించడానికి అనుమతి పొందిన దుకాణాల యజమానులతో తహసీల్దార్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆరుగురు, రాయల చెరువు గ్రామంలో ముగ్గురు బాణసంచా విక్రయాలకు లైసెన్సు పొందారన్నారు. దుకాణాలు ఏర్పాటు చేసేటప్పుడు వాటి మధ్య దూరం మూడు మీటర్లు ఉండాలని, షాపుల వద్ద మండే స్వభావం గల వస్తువులు ఉంచరాదన్నారు. దీపావళి పండుగ ముగిసిన తర్వాత టపాకాయలు ఇళ్లలో ఉంచుకోరాదన్నారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు వారు టపాసులు విక్రయించే స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి అర్బన్: పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. స్థానిక టీచర్స్ కాలనీలోని పెన్షనర్స్ భవన్‌లో అధ్యక్షుడు సత్యప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో 15 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులను అందజేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు వీరారెడ్డి, అశ్వర్థరెడ్డి, హనుమంత రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయం తనిఖీ

గార్లదిన్నె: మండలంలోని జంబులదిన్నె సొసైటీ కార్యాలయాన్ని గురువారం ఆర్డీఓ వసంతబాబు తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 1లోపు రైతుల వివరాలు వెంటనే కంప్యూటరైజేషన్ చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.అలాగే సహకార సంఘాల్లో సభ్యులందరూ ఆధార్ కార్డు, వన్‌బీ, అడంగల్ తదితర వివరాలు సీఈఓకు అందజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మ, జంబులదిన్నె సొసైటీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, రాయల్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీపులు, కార్లు, లారీలు, ఆటోలు తదితర వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆజాద్, హెడ్ కానిస్టేబుళ్లు జాఫర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు హద్దుల ఏర్పాటుకు రేపు రీ సర్వే

గుంతకల్లుటౌన్: సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల హద్దుల ఏర్పాటుకు ఈ నెల 19న మండల సర్వేయర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్‌ల చేత రీ సర్వే చేయించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్యాంకు స్థలం కబ్జా అవుతోందని, రక్షించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ అపర్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఎస్ ట్యాంక్ స్థల హద్దులను ఏర్పాటు చేసేందుకు సర్వే చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ట్యాంకు చుట్టూ స్థలాలు కలిగిన యజమానులు సర్వేలో పాల్గొనాలని ఆయన కోరారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

నార్పల: మండలంలోని శిద్దరాచర్ల సచివాలయం వద్ద సర్పంచు రామాంజనేయుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ఈ సందర్భంగా శాంతిరాం మెడికల్ కాలేజ్, జనరల్ వైద్యశాల వైద్యులు 109 మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పలువురిని శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి వెంకటరమణ, ఎంఆర్‌పీఎస్ రామాంజనేయులు, సాకే శివయ్య, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 వేల నగదు, ఫోన్ చోరీ

గార్లదిన్నె: మండల కేంద్రంలో ఒరిస్సా వ్యక్తికి సంబంధించి రూ.20 వేలు నగదు, సెల్‌ఫోన్ అపహరణకు గురైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి గార్లదిన్నెలో పానీపూరి సెంటర్ నిర్వహిస్తున్నారు. సెంటర్‌లో పనిచేయడానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన మంగల్ అనే యువకుడిని పనిలో పెట్టుకున్నారు. ఆ యువకుడు రెండు రోజుల క్రితం రూ.20 వేలు, సెల్‌ఫోన్ తీసుకొని పారిపోయినట్లు బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

15 ద్విచక్ర వాహనాల సీజ్

నార్పల: రికార్డులు లేని 15 ద్విచక్ర వాహనాలను సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ గురువారం సీజ్ చేశారు. వివరాలు.. మండల కేంద్రంలో అధికంగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో సిబ్బందితో కలసి సీఐ, ఎస్ఐ స్థానిక సీపీ కాలనీలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అలాగే దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

గొర్రె, పొట్టేలు అపహరణ

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఓ రైతుకు చెందిన గొర్రె, పొట్టేలును గుర్తుతెలియన వ్యక్తులు అపహరించారు. గురువారం బాధిత రైతు చెన్నారెడ్డి తెలిపిన వివరాల మేరకు..రైతు పశువులతో పాటు గొర్రె, పొట్టేలు మేపుతూ రాత్రి సమయంలో ఇంటి వద్ద పశువుల షెడ్డులో కట్టేసేవారు. బుధవారం రాత్రి వర్షం కురుస్తుండడంతో గొర్రె, పొట్టేలును షెడ్డులో కట్టేసి ఇంట్లో నిద్రించారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు రూ.30 వేలు విలువ చేసే గొర్రె, పొట్టేలు అపహరించారు.ఈ మేరకు బాధిత రైతు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె: భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ సూచించారు. గురువారం ఏఈ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ స్టార్టర్లను చేతితో ముట్టుకోరాదన్నారు. గ్రామాల్లో కరెంట్ స్తంభాలకు చెట్లు కొమ్మలు తగులుతుంటే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలపాలన్నారు. చిన్న పిల్లలను విద్యుత్ స్తంభాల వద్దకు రానివ్వరాదన్నారు. గాలికి తెగిపోయిన విద్యుత్ వైర్లు తాకరాదన్నారు. పొలాలకు వెళ్లిన రైతులు వర్షం మొదలవగానే ఇంటికి చేరుకోవాలన్నారు.

కాలువల్లో పూడికతీత

పామిడి: బంగాళఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో ముందుజాగ్రత్తల్లో భాగంగా పంచాయతీ ఈఓ గోపాల్ ఆధ్వర్యంలో రెండురోజులుగా మురికి కాలువలు, ఊటకాలువలు, డ్రైనేజీల్లో పూడికతీత చేపట్టారు. ఈ పనులను గురువారం ఎంపీడీఓ తేజోత్స్న పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు.. గంగిరెడ్డి కాలువ, పెద్ద కాలువల్లో పూడికతీత చేపట్టామన్నారు.


శ్రీపార్థ జ్ఞానేశ్వరి గ్రంథ ఆవిష్కరణ



గ్రంథం ఆవిష్కరిస్తున్న గురువు గోపాల్ తుకారాం వాస్కర్ మహారాజ్

పామిడి: పట్టణంలోని పెద్ద విఠోబ దేవాలయ ప్రాంగణంలో డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో శ్రీపార్థ జ్ఞానేశ్వరి గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 9,12 అధ్యాయాల తెలుగు అనువాద గ్రంథాన్ని పండరీపురం వార్కరి సాంప్రదాయ గురు పరంపరాధిపతి గోపాల్ తుకారాం వాస్కర్ మహారాజ్ ఆవిష్కరించారు. స్థానిక భావసార క్షత్రియ సమాజ్ సౌజన్యంతో అచ్చు వేసిన ఈ గ్రంథ ఆవిష్కరణ పూజా కార్యక్రమాల్లో భక్తులు భక్తిప్రత్తులతో పాల్గొని తరించారు. అంతకుముందు ఈ గ్రంథ ప్రతులను దిండి భజనల నడుమ గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో ఫిర్కా సభ్యులు జే శ్రీనివాసరావు, కే శ్రీనివాసరావు. కే వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి



గుంతకల్లులో రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి



పాతగుంతకల్లులోని వాల్మీకి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని



యాడికిలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బొంబాయి రమేష్ నాయుడు

గుంతకల్లు టౌన్: రామాయణ సృష్టికర్త వాల్మీకి మహర్షి ఆదర్శప్రాయుడని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం మహర్షి వాల్మీకి జయంతి రాష్ట్ర పండుగను వాల్మీకి సంఘం, వైఎస్సార్‌సీపీ, వివిధ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. పాత గుంతకల్లు, కసాపురం రోడ్‌లోని వాల్మీకి విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, వాల్మీకి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చాముండేశ్వర్, మాచర్ల ఎల్లప్ప, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు గాదిలింగేశ్వరబాబు, భీమలింగప్ప తదితరులకు పూలమాలలు వేసి పూజలు చేశారు. వైవీఆర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వాల్మీకి అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బోయ సుంకప్ప, మాజీ అధ్యక్షుడు ఎద్దుల శంకర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్, బీజేపీ, జనసేన తదితర పార్టీల నాయకులు వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

రక్తదాతలకు ప్రశంసాపత్రాలు

వాల్మీకి జయంతి సందర్భంగా పట్టణంలోని హౌసింగ్‌బోర్డు వివేకానంద పార్క్‌లో వాల్మీకి యువజన నాయకుడు బోయతిమ్మప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించిన శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతకుముందు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి,మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్లు గాదిలింగేశ్వరబాబు, భీమలింగప్ప, ఎస్వీఆర్.మోహన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు బోయ తిమ్మప్ప, మధు, భీమా, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు, బసినేపల్లి గ్రామాల్లో గురువారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

శింగనమల: శింగనమలలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో వాల్మీకి మహర్షి, సీతారాముల చిత్ర పటాలను ఊరేగించారు. అలాగే బుక్కరాయసముద్రం మండలంలోని దండువారిపల్లిలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు వాల్మీకులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వాల్మీకి మహర్షి విగ్రహంకు అభిషేకం చేసి, పూలమాలలు వేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు తలారి రంగయ్య, నారాయణస్వామి, రామాంజనేయులు, సూర్యనారాయణ, పెద్దయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్/తాడిపత్రి రూరల్: బోయ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో స్థానిక యల్లనూరు రోడ్డులోని వాల్మీకి మహర్షి విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బీజేపీ నాయకులు అంకాల్ రెడ్డి, రంగనాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేశారు. అలాగే తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు.

వాడవాడలా వేడుకలు

పెద్దవడుగూరు/పామిడి/నార్పల/గార్లదిన్నె: పెద్దవడుగూరు, పామిడి, నార్పల, గార్లదిన్నె మండలాల్లో వాల్మీకులు మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో గురువారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని పోతులయ్య కట్ట వద్ద గ్రామానికి చెందిన వాల్మీకుల ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. సర్పంచు తలారి అరుణ, నాగేష్ దంపతులు విగ్రహానికి పూలమాలలు వేసి టెంకాయలు సమర్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే మండల కేంద్రంలోని కమలపాడు రహదారిలో ఉన్న వాల్మీకి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ గ్రామ వాల్మీకుల ఆదర్యంలో పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు తిరుపతి, రామచంద్రుడు, రాయల చెరువులో శివయ్య, నరసింహులు, బాలరాజు, క్రిష్ణయ్య, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పల్లె పండుగ'

శింగనమల/గార్లదిన్నె/యల్లనూరు/పెద్దవడుగూరు/పామిడి: పల్లె పండుగ కార్యక్రమం కొనసాగుతోంది. బుక్కరాయ సముద్రం మండలంలోని వడియంపేట, పొడరాళ్ల గ్రామ పంచాయతీలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గురువారం సీసీ రోడ్లకు ఎంపీపీ సునీత భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ సదాశివ, పీఆర్ జేఈ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గార్లదిన్నె మండలంలోని బూదేడు, క్రిష్టాపురం, ముకుందాపురం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యల్లనూరు మండలంలోని వాసాపురం, బొప్పేపల్లి, బుక్కాపురం, కూచివారిపల్లి గ్రామాల్లో ఇన్‌ఛార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఏపీఓ షబ్బీర్‌బాషా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. పెద్దవడుగూరు మండలంలోని జి.వెంకటాంపల్లి, కండ్లగూడూరు, లక్ష్మంపల్లి, మల్లేనిపల్లి, విరుపాపురం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ బారెన్‌సాహెబ్, ఏపీఓ పుల్లారెడ్డి, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఆంజినేయులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు. పామిడి మండలంలోని ఖాదర్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ తేజ్యోత్స్న, ఈఓఆర్డీ కృష్ణకుమార్, వైస్ ఎంపీపీ కాయల మహేష్, సర్పంచ్ కే సుశీలమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు.